
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
గురువారం 21 నవంబరు 2024

రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కడియం (ఫైల్)



నెరవేరనున్న కల!

- రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు జీవో జారీ
- ఫలించిన ఎమ్మెల్యే కడియం కృషి
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో సమీకృత డివిజనల్ కాంప్లెక్స్
- సమీకృత కలెక్టరేట్ తరహాలో ఏర్పాటు
- 2.35 ఎకరాల స్థలం కేటాయింపు
- ఒకేచోట రానున్న 16 ప్రభుత్వ సేవలు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 20: అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ప్రజల కల నెరవేరబోతోంది. గత ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను, రెవెన్యూ డివిజన్లను, మండలాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా ఘన్‌పూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్‌గా మారి ఆరు సంవత్సరాలు కావస్తున్నా కార్యాలయాల ఏర్పాటు జరుగలేదు. సరైన కార్యాలయాలు లేకపోవడంతో అధికారులు సరిగ్గా పని చేయలేక ప్రజలకు మెరుగైన సేవలు అందించలేక పోతున్నారన్నారు. రానున్న రోజుల్లో మెరుగైన సేవలందించడానికి గాను రెవెన్యూ డివిజన్ కార్యాలయాల సముదాయాన్ని ఏర్పాటు చేయాలనే ప్రజల కోరిక మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ సముదాయాన్ని ఏర్పాటు చేసి ప్రజల, అధికారుల ఇబ్బందులు తొలగించాలని యోచించారు.

శిథిలావస్థలో కార్యాలయాలు..

ఘన్‌పూర్ మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న ఎంపీడీవో కార్యాలయ భవనం 1975లో నిర్మించడంతో శిథిలావస్థకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం సైతం అనేక ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో శిథిలావస్థలో ఉంది. కొత్తగా వచ్చిన ఆర్డీవో కార్యాలయానికి, ఏసీపీ కార్యాలయాలకు భవనాలు లేకపోవడంలో తాత్కాలిక భవనాల్లో నడుస్తున్నాయి. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ భవనాలను తొలగించి కొత్త వాటిని నిర్మించడం కంటే సమీకృత డివిజన్ కార్యాలయాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

స్థలాన్ని పరిశీలించిన కడియం

రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ ఏర్పాటునకు గాను గత జులై మూడవ వారంలో ఎమ్మెల్యే కడియం మండల కేంద్రంలో స్థలాలను పరిశీలించారు. ఘన్‌పూర్ రైతు వేదిక వెనుకాల ఉన్న స్థలాన్ని, ప్రస్తుత ఎంపీడీవో కార్యాలయం, అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. రెండు స్థలాలకు సంబంధించిన స్థలాలను సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కడియం కోరగా చివరకు ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయం ఉన్నటువంటి 2.35 ఎకరాల స్థలాన్ని డివిజన్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ఫైనల్ చేసి ఇంజనీరింగ్ అధికారులను ఎస్టిమేషన్స్ తయారు చేయించి ఇవ్వాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చిన ఎస్టిమేషన్స్, ప్లాన్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కాగా, రెవెన్యూ డివిజన్ ఆఫీసెస్ కాంప్లెక్స్ నిర్మాణానికి గాను రాష్ట్ర ప్రభుత్వం వంబరు 17న రూ.26 కోట్లు కేటాయిస్తూ జీవోను జారీ చేసింది. అనేక ఏళ్ల ప్రజల చిరకాల కల నెరవేరనుంది.

16 శాఖల విధులు ఒకే చోట

రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ నిర్మాణంతో సుమారు 16 ప్రభుత్వ శాఖల కార్యకలాపాలు ఒకే చోట నిర్వహించనున్నారు. రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్, ఎంపీడీవో, ఈజీఎస్, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, ఐకేపీ, ఐసీడీఎస్, ఆర్అండ్‌బీ, విద్యాశాఖ, ట్రెజరీ, తదితర శాఖలకు సంబంధించిన సేవలు ఒకే చోటు నుంచి ప్రజలకు అందనున్నాయి.

కాంప్లెక్స్ నిర్మాణం ఏర్పాటు ఇలా..

సుమారు 50వేల స్క్వేర్ ఫీట్స్ విస్తీర్ణంలో సుమారు 16 శాఖలు ఒకే కాంప్లెక్స్ నుంచి సేవలు అందించేలా జీప్లస్ ప్లస్ భవనాలను నిర్మించేలా ఎస్టిమేషన్స్ రూపొందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్, మొదటి, రెండవ అంతస్తుల్లో వివిధ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. పార్కింగ్ స్థలం, చుట్టూరా గ్రీనరీ ఉండేలా ప్లాన్ రూపొందించినట్లు సమాచారం.



తొలగించనున్న ఎంపీడీవో కార్యాలయ భవనం

ఎమ్మెల్యే కృషితో డివిజనల్ కాంప్లెక్స్

- ఆర్డీవో ధరంసోత్ వెంకన్న



ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితో రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ మంజూరైంది. ఒకే చోట అన్ని శాఖల సముదాయాలు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు కానున్నాయి. అధికారులకు సైతం మేలుగా ఉంటుంది. సమయం వృథా కాకుండా అధికారులు వివిధ మీటింగ్ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగంగా ఉంటుంది. కాంప్లెక్స్ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన అన్ని రకాల అధికారుల సేవలు అందుతాయి.

పట్టణ రూపురేఖలు మారుతాయి..

- గన్ను నర్సింహులు, మాజీ ఎంపీటీసీ



రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ ఏర్పాటుతో ఘన్‌పూర్ పట్టణ రూపురేఖలు మారనున్నాయి. పట్టణ అభివృద్ధిలో కాంప్లెక్స్ నిర్మాణం మైలురాయిగా నిలవనుంది. గ్రామాల నుంచి వివిధ రకాల పనుల కోసం వచ్చే ప్రజలకు ఒకే చోట అన్ని సేవలు అందుబాటులోకి రావడం హర్షించదగిన విషయం.



బమ్మెరలో పోతన సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే యశస్విని, కలెక్టర్, తదితరులు

పోతన ఊరిలో అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం

- హరిత హోటల్, చెక్‌డ్యామ్ నిర్మాణాలకు కృషి
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

7లో



జీడికల్ వీరాచల క్షేత్రంలో సీతారామచంద్రస్వామి కల్యాణతంతును నిర్వహిస్తున్న వేదపండితులు

కల్యాణం.. కమనీయం

- అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయం
- భక్తజనంతో ఉప్పొంగిన జీడికల్ వీరాచల క్షేత్రం
- పట్టువస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

7లో



ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన గనులు అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జనగామ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లాను మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు భూలక్ష్మి, వాంకుడోతు అనిత, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏడవెల్లి కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్, కౌన్సిలర్లు స్వరూప, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోదీని తెలంగాణ ద్రోహి అంటే ఊరుకోం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీని తెలంగాణ ద్రోహి అంటే ఊరుకోమని, నాలుక చీరేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి హెచ్చరించారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాలతో సమానంగా తెలంగాణకు నిధులు ఇచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరించడం ఓర్వలేక రేవంత్‌రెడ్డి చిల్లర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వరంగల్‌కు స్మార్ట్ సిటీ, అమృత్ పథకం, కేఎమ్సీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కాజీపేటకు వ్యాగన్ పరిశ్రమ, రామప్పకు యునెస్కో, గిరిజన యూనివర్సిటీ ఇచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న మోదీ కాళ్లు కడిగి సీఎం రేవంత్‌రెడ్డి తలపై చల్లుకోవాలన్నారు. అబద్ధాలకు చిరునామా కాంగ్రెస్ పార్టీ అని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. సమావేశంలో లేగ రామ్మోహన్‌రెడ్డి, సౌడ రమేష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, బొమ్మకంటి అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు సరిగా నమోదు చేయాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఫారంలో ఉన్న ప్రతి ప్రశ్నకు సంబంధించిన వివరాలన్నీ అతి ముఖ్యమైనవని, అవన్నీ జాగ్రత్తగా డేటాఎంట్రీ కావాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో డేటా ఎంట్రీ గురించి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వేలో సేకరించిన వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శుక్రవారం నుంచి డేటా ఎంట్రీ ప్రారంభం కావాలని, అందుకు తగ్గట్టుగా మాస్టర్ ట్రైనర్లు మండల స్థాయిలో డేటా ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతీ మండలంలో ఉన్న ఆపరేటర్ల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అవసరమైతే రెండు, మూడు సార్లయినా డెమో చేసి చూపించాలన్నారు. ఎక్కడా తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండ నుంచి జనగామ జిల్లాలోకి ప్రవేశించడానికి తీసుకునే టర్నింగ్ పాయింట్, జనగామ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లడానికి టర్నింగ్ ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. రఘునాథపల్లి ఫ్లై ఓవర్ వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు, పాదాచారులు రోడ్డు దాటే ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్ రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా జిల్లాలోని రహదారులు, అంతర్గత దారులకు అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలని, ఈ విషయాల్లో రోడ్డు, భవనాల శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏసీపీ పార్థసారథి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎన్‌పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్టీసీ డీఎం స్వాతి, 108 జిల్లా మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం లక్ష్మీనృసింహుడు

- రేపటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు
- 24న కల్యాణం.. ఏర్పాట్లు పూర్తి

8లో

మినిమమ్ టైంస్కేల్ వర్తింపజేయాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్



సదస్సుకు తరలివెళుతున్న కేజీబీవీ, యూఆర్ఎస్ బాధ్యులు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులకు మినిమమ్ టైంస్కేల్ వర్తింపజేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు, కార్యాచరణ కోసం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర శాఖ బుధవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి తరలివెళుతున్న ఉద్యోగులనుద్దేశించి ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ పాలకులు చాలీచాలని వేతనాలతో కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులతో శ్రమ దోపిడీ చేయిస్తున్నారని ఆరోపించారు. ఏదో ఒకరోజు తమకు మంచిరోజులు రాకపోతాయా, వేతనాలు పెరుగకపోతాయియా అని దశాబ కాలంగా పని చేస్తున్నారన్నారు. ఓవైపు విద్యాబోధన, మరో వైపు విద్యార్థుల బాగోగులు చూసుకుంటూ వార్డెన్ లేకున్నా ఆ బాధ్యతలు కూడా వారే నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు అందించాలని, వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు జనగామ పట్టణంలో జెండా ఊపి వాహనాలను సదస్సుకు పంపించారు. కార్యక్రమంలో చైతన్య, రజని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ధర్మకంచ మినీ స్టేడియంలో అండర్-8, 10, 12 విభాగాలలో బాలబాలికలకు ఎంపికలు జరుగుతాయన్నారు. పాల్గొనే క్రీడాకారులు గురువారం ఉదయం 9 గంటలకు జనన ధృవీకరణ పత్రంతో ధర్మకంచ మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు డిసెంబరు 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. వివరాలకు 98850 46437 నంబరులో సంప్రదించాలన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడలు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22న జిల్లాలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్(10-17), సీనియర్(18-54) విభాగాలలో జిల్లా స్థాయి క్రీడలు ఉంటాయన్నారు. పాల్గొనే వారు జనన ధృవీకరణ పత్రం, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక ధర్మకంచ మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 99480 48355 నంబరులో సంప్రదించాలన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- టీబీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



వంగాలపల్లి - కంణాపురం చౌరస్తా వద్ద మాట్లాడుతున్న తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

చిలుపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు (వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేసి ఈఎస్ఐ ఆస్పత్రి సౌకర్యం కల్పించాలని తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సమాఖ్య(టీబీఎన్ఆర్‌కేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దరిపెల్లి చంద్రం డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వంగాలపల్లి - కరుణాపురం చౌరస్తాలో ప్రధాన రహదారిపై ఆయా గ్రామాలకు చెందిన కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ, రాష్ట్ర కేబినెట్‌లో కార్మిక శాఖ మంత్రిని నియమించడంతో పాటు, మొదటగా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన భవన నిర్మాణ కార్మికులను వెనక్కి పంపించాలని, 55 సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ చెల్లించడంతో పాటు, ప్రతీ కార్మికునికి రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, లేబర్‌కార్డు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగి పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి భిక్షపతి, సంఘం నాయకులు రాసమల్ల కొమురయ్య, తూడి అంజయ్య, కృష్ణ, ఇమ్మడి రాజు, సాదిక్, మహేందర్, ఎల్లయ్య, గంగాధర్, దశరథం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నర్మద బాయి

రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకుల బాలికలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన కాళేశ్వరం 10వ జోనల్‌స్థాయి క్రీడల్లో ములుగులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్మదబాయి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివిధ క్రీడల్లో 8 స్వర్ణపతకాలు, రెండు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించు కున్నారని అన్నారు. 19 సంవత్సరాల విభాగం కబడ్డీ పోటీల్లో రన్నరప్, చెస్‌లో స్వర్ణం, 14 సంవత్సరాల విభాగం టెన్నికాయిట్‌లో రన్నరప్‌గా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పాల్ స్వాతి, పీడీ త్రివేణి, పీఈటీ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామప్పలో ఈ వృక్షాలు ఎందుకు ?

- ఆలయ ప్రాంగణంలోని ఏడాకుల చెట్లు
- విష వాయువును విడుదల చేస్తాయంటున్న శాస్త్రవేత్తలు
- తొలగించాలని పర్యాటకుల డిమాండ్

వెంకటాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం ప్రధాన గేట్ నుంచి ఆలయం వరకు రెండువైపులా ఏడాకుల చెట్లు విస్తరించి ఉన్నాయి. వీటి నుంచి వచ్చే గాలి పీల్చుకోవడం వల్ల అనారోగ్యం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్తమా రోగులకు ఇవి మంచిదికాదని శాస్త్రీయంగా నిరూపితమైనట్లు తెలుస్తోంది. ఈ చెట్టు భారతదేశంలో చాలా చోట్ల కనిపిస్తున్నట్లు వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎడిన్‌బర్గ్‌కు చెందిన ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు అల్స్టాన్ జ్ఞాపకార్థం ఈ వృక్షానికి అల్‌స్టోనియా స్కోలరీస్ శాస్త్రీయనామం పెట్టినట్లు తెలుస్తోంది. ఈ చెట్లతో ఎలాంటి ఉపయోగం కూడా లేనట్లు సమాచారం. పిల్లలకు అవసరమయ్యే చెక్క పలకలను తయారు చేసేందుకు ఈ చెట్టు కలపను ఉపయోగిస్తారని తెలుస్తోంది. ఆంగ్ల భాషలో డెవిల్ ట్రీగా పిలువబడే దెయ్యం వృక్షంగా పేరు వచ్చింది. భారతదేశంలో దెయ్యం వృక్షంగా ప్రాచుర్యం పొందింది. అక్టోబరులో ఈ చెట్టు సువాసన కలిగిన పుష్పాలను కూడా అందిస్తుంది. కానీ, ఈ చెట్టు అన్ని భాగాలూ విషపూరితమైనవిగా శాస్త్రవేత్తలు అంటున్నారు. పశ్చిమ కనుమల్లోని గిరిజన ప్రజలు ఈ చెట్టు నీడలో కూర్చునేందుకు అయిష్టత వ్యక్తం చేస్తారని తెలుస్తోంది. రామప్ప ప్రధాన ఆలయంలో ఉన్న ఇలాంటి చెట్లను తొలగించాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



రామప్ప ప్రధాన గేట్ నుంచి దేవాలయం వరకు ఉన్న ఏడాకుల చెట్టు

దళారుల చేతిలో నష్టపోవద్దు

- మద్దతు ధర చెల్లించేందుకే కొనుగోలు కేంద్రాలు
- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్

నర్సింహులపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా ఉండేందుకే రాష్ట్రప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. వడ్ల కొనుగోలు సెంటర్లలో ఉత్పత్తులను విక్రయించి, మద్దతు ధర పొందాలని కోరారు. వంతడుపల స్టేజీ, ముంగిమడుగు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్య దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మ్యాచర్ 17 శాతంలోపు ఉన్న సన్నరకం వడ్ల మద్దతు ధర క్వింటాకు రూ. 2320తో పాటు రూ.500 బోనస్ రైతుల ఖాతాలో జమ చేస్తారన్నారు. కంపసాగర్, సిద్ధి, వరంగల్ సన్నాలు, జగిత్యాల్, రాజేంద్రనగర్, కృష్ణ తెలంగాణ సోనాతో పాటు 33 రకాల సన్నధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో భాగంగానే ధాన్యానికి ధరతో పాటు బోనస్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మేరుగు సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, తహసీల్దార్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్రి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరోజు రాజశేఖర్, గ్రామీణ వైద్యుల మండల అధ్యక్షుడు గుగులోత్ రాజేందర్, యువజన నాయకులు చిర్ర సతీష్, మానవ హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ రవీందర్, యాకన్న, బిచ్చు, వెంకన్న, శంకర్, ఉదయ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంచంద్రునాయక్



మల్యాల పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

మెరుగైన వైద్య సేవలందించాలి

మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాల పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు ట్యాగ్ పెసిలిటీస్‌కి పంపించాలని, 102 వాహనాన్ని వినియోగించుకోవాలని, వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన దగ్గర నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ వంద శాతం వేయాలన్నారు. గర్భిణుల సమోదు 12 వారాల్లో చేయాలన్నారు. రెండు వారాలు మించి దగ్గు ఉంటే తెమడ పరీక్ష చేయించాలని, క్షయ వ్యాధిని త్వరగా గుర్తించి ఆరు నెలల వరకు మందులు వాడితే నయమవుతుందన్నారు. ఈ తనిఖీల్లో డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మ పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మహబూబాబాద్ శివారు బోరింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై దీపిక రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలుకు చెందిన మంద సంధ్య (35) పని నిమిత్తం మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామానికి ఈనెల 18న మరో మహిళతో కలిసి వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఓ ద్విచక్ర వాహనదారుడిని ఆశ్రయించారు.

సంధ్యతో పాటు మరో మహిళను బైక్‌పై మహబూబాబాద్‌కు తీసుకువస్తుండగా బోరింగ్‌తండా సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి ఆమె కింద పడింది. ఈ ఘటనలో సంధ్య తలకు తీవ్రగాయాలు కాగా, 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంధ్య బుధవారం ఉదయం మృతి చెందారు. మృతురాలికి భర్త మల్లికార్జున్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయి కృతజ్ఞతలు

బాలసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగర అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎ రేవంత్‌రెడ్డికి క్రెడాయి వరంగల్ చాప్టర్ అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వరంగల్ మాస్టర్ ప్లాన్ - 2041కు ఆమోదముద్ర వేయటంపై సంతోషం వ్యక్తం చేశారు. మామునూర్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు రూ. 205 కోట్లు, ట్రైసిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4170 కోట్లు, వరంగల్ ఆర్డీవో ఆఫీసు జంక్షన్ నుంచి గొర్రెకుంట, ఏనుమాముల మీదుగా 163 జాతీయ రహదారిని కలిపే పైడిపల్లి(ఆరెపల్లి) వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేసి, నయీంనగర్ వంతెనను ప్రారంభించి అనేక అభివృద్ధి పనులకు నిధుల కేటాయించి త్రినగరి అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఉపాధ్య క్షులు అమరేందర్‌రెడ్డి, శాఖమూరి అమర్, ఎంరవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జె. మనోహర్, సంయుక్త కార్యదర్శులు ఎల్ రజినీకాంత్‌రెడ్డి, ఎం. రాజ్‌కుమార్, జి. రాజేందర్‌రెడ్డి, కోశాధికారి ఎ.వెంకటమల్లారెడ్డి ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ రాజు

తొర్రూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు కోర్టు జడ్జి మట్ట సరిత న్యాయవాదులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రవీణ్ రాజు మాట్లాడుతూ జడ్జి మట్ట సరితను వెంటనే తొర్రూరు కోర్టు నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా హైకోర్టు స్పందించి వెంటనే జడ్జి సరితను విధుల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఘనపురం రామకృష్ణ, న్యాయవాదులు యాకాంబ్రం, బొల్లం వెంకటేష్, భాస్కర్, గంపల ప్రవీణ్, శ్రీశైలం, కృపావతి, పల్లవి, తదితరులు ఉన్నారు.

విద్యా సంస్థల పరిశీలన

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసముద్రం విలేజి శ్రీ వివేకవర్ధిని, ధన్నసరి సెయింట్ జాన్స్, కల్వల మోడల్ స్కూళ్లను బుధవారం జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్, ఎంఈవో కాలేరు యాదగిరి పరిశీలించారు. పాఠశాలల్లో విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మాక్ టెస్ట్ 1, 2 ఫలితాలను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.77 వేల బంగారు గొలుసు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం జనగామ పోలీస్ స్టేషన్‌లో నిందితుని అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఏసీపీ పార్థసారథి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా, బక్కరుప్పుల తండాకు చెందిన కేలోత్ సాయికృష్ణ అక్టోబరు 14న ఇంటి నుంచి బయల్దేరి ఏదైనా పని చేద్దామని జనగామకు వచ్చాడు. జాబ్ దొరకక పోవడంతో బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈనెల 4న గతంలో తాను డిగ్రీ పూర్తి చేసిన ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీజీ అడ్మిషన్ కోసం వెళ్లాడు. అక్కడి లైబ్రేరియన్ భూక్య ఉపేందర్ వికలాంగుడని గమనించాడు. ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేయాలని అనుకున్నాడు. మరుసటి రోజు ఉదయం లైబ్రేరియన్ కంటే ముందే కళాశాలకు చేరుకుని లైబ్రరీ వద్ద వేచి ఉన్నాడు.

కొద్దిసేపటికి లైబ్రేరియన్ వచ్చి లైబ్రరీలో కిటికీలు తీద్దామని వెళ్తుండగా సాయికృష్ణ లైబ్రేరియన్‌ను వెనుక నుంచి కింద పడేసి మెడలో ఉన్న బంగారు చైన్ లాక్కొని పారిపోయాడు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీసీపీ సూచనల మేరకు ఏసీపీ పార్థసారథి పర్యవేక్షణలో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారం మేరకు బుధవారం ఉదయం స్థానిక విజయ లాడ్జిపై ఉన్న ఎస్సీ హాస్టల్‌లో నిందితున్ని పట్టుకొని విచారణ చేయగ నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.77వేల విలువ గల 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

- నేడు హనుమకొండ కలెక్టరేట్‌కు

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌కు గురువారం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు వస్తున్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా పేర్కొనే విషయంపై బహిరంగ విచారణకు కమిషన్ వస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోని బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాల నాయకులు బహిరంగ విచారణకు హాజరై రిజర్వేషన్ల ధామాషాపై అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలు కమిషన్‌కు తెలియజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కొడకండ్ల ఏఎంసీ కమిటీ ప్రమాణం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం

కొడకండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ చైర్మన్ ప్రీతమ్ కుమార్ సమక్షంలో చైర్‌పర్సన్‌గా దేవరుప్పులకు చెందిన నల్లా అండాలు, వైస్ చైర్మన్‌గా ఏడునూతుల గ్రామానికి చెందిన సాయికృష్ణ, డైరెక్టర్లుగా దేశగాని నాగరాజు, వలభోజు రమేశ్, బత్తుల వెంకన్న, వనం మోహన్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులతో సమన్వయంతో ముందుకు సాగి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించి వారికి అభివృద్ధికి కృషి చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులను రాజుగా చేసేందుకు అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. అంతకుముందు యశస్వినిరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు బోనాలు, డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.లక్ష్మీనారాయణ డి.సురేష్‌నాయక్, డి.రాజేష్‌నాయక్, నల్లా శ్రీరాములు, అందె యాకయ్య, పసునూరి మధుసూదన్, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి, జీవాల మృతి



నర్సయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ రైల్వే గేటు వద్ద సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వైపు వెళ్తున్న ఓ రైలు రైల్వే గేటు దాటుతున్న 10 జీవాలను, కాపరి దేవసాని నర్సయ్య(58) అనే వ్యక్తిని ఢీకొట్టడంతో జీవాలు, కాపరి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు, జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన పెరబోయిన రాజు, పులిగిల సోమయ్య వివాహ వేడుకకు వెళ్లాల్సి ఉంది. వారి జీవాలను కాయడానికి బుధవారం నర్సయ్యకు అప్పగించారు. నర్సయ్య జీవాలను మేపడానికి కుర్చపల్లి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్ రైల్వే గేటు దాటివచ్చి మేపాల్సి ఉండగా వాటిని తోలుకొని గేట్ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే రైలు వస్తుందని గేటు మూసివేశారు. జీవాలు పరుగెత్తుకొని వచ్చి గేటు కింది నుంచి దాటాయి. జీవాలతో పాటు నర్సయ్య గేటు దాటివచ్చాడు. కొన్ని జీవాలు గేటు దాటలేదు. వాటిని దాటించడానికి నర్సయ్య వెనక్కి వెళ్లాడు. అప్పటికే గేటు దాటిన జీవాలు ఒక్కసారిగా తిరిగి వెనక్కి వచ్చాయి. అప్పటికే రైలు సమీపించడంతో నర్సయ్యను, జీవాలను రైలు ఢీకొట్టింది. నర్సయ్య విద్యుత్ స్తంభానికి బలంగా తగిలి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో 10 జీవాలు మృతి చెందాయి. జీవాలను కాపాడబోయి నర్సయ్య మృతి చెందిన సంఘటనతో కుర్చపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఆర్పీఎఫ్ ఎస్సై రాజన్న, జీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, పీసీ నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య కోమల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన బ్లూకోర్ట్స్ సిబ్బంది

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్ సమీపంలోని ఓ వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరాగాంధీ సెంటర్ సమీపంలోని స్పందన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. 2014లో ఆమె భర్త రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమెకు, రమేష్ అన్న (వరుసకు బావ) మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. దీంతో మనస్తాపం చెందిన స్పందన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఇది గమనించిన పక్కింటి వారు డయల్ 100కు కాల్ చేయడంతో బ్లూకోర్ట్స్ సిబ్బంది రాంబాబు, రవి ఘటన స్థలానికి చేరుకుని ఉరివేసుకున్న స్పందనను కిందకు దించి సీపీఆర్ చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. అనంతరం చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో చికిత్స పొందుతున్న బ్లూకోర్ట్స్ సిబ్బంది రాంబాబు, రవి తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్
- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



నిరాహార దీక్షలో పాల్గొన్న వీహెచ్‌పీఎస్ నాయకులు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. చేయూత పించన్ల పెంపు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో బుధవారం జనగామలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన రిలే నిరసన నిరాహార దీక్షలను ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఇవ్వకుండా రూ.6 వేల పింఛన్ల పెంపుతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వికలాంగులకు అన్యాయం చేస్తుందన్నారు. వికలాంగుల మీద చిత్తశుద్ధి ఉంటే వికలాంగ మంత్రిత్వ శాఖను తక్షణమే ఏర్పాటు చేసి వారి సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ దివ్యాంగ సమాజంపై, చేయూత పింఛన్‌దారులపై చిన్నచూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


పెన్షన్ల పెంపు, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23 వరకు కలెక్టరేట్ కేంద్రంగా వీహెచ్‌పీఎస్ నిరసన దీక్షలు చేపడుతుందని, స్పందించని పక్షంలో 26న చలో హైదరాబాద్ వికలాంగుల విజృంభన మహాసభను నిర్వహిస్తామని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నగేష్, ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, పైసా రాజశేఖర్, ఇనుముల నర్సయ్య, సందెన రవీందర్, ముక్కెర ముఖేష్, గువ్వల రవి, బొట్ల మహేష్, గంధమల్ల ఉదయ్, అరుణ్, కట్ట ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2440	2080
పల్లికాయ (సూక)	5460	4000
పల్లికాయ (పచ్చిది)	3500	3000
కందులు	-	-
పెసళ్లు	6223	5250
పత్తి	6810	5800
కొత్తపతి	-	-
పసుపు (కాడి)	11529	11000
పసుపు (గోల)	11011	10950
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	15000	14000
వండర్‌హాట్ ఏసీ	13500	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం


చెట్ల పొదల మధ్య కూరుకుపోయిన చౌడేశ్వరాలయం


శిథిలమై నేలమట్టమైన 500 స్తంభాల ఆలయం


భోగేశ్వరాలయంలోని శివాలయం, నంది విగ్రహం

నాటి సైనిక స్థావరం.. నేడు శిథిలం

చరిత్ర

- పలు ప్రాచీన ఆలయాలకు నిలయం కొండపర్తి
- అబ్బుర పరిచే త్రికూటాలయం
- శిథిలావస్థకు చేరిన కట్టడాలు.. మట్టిలో కూరుకుపోతున్న శిల్పాలు
- పాలకుల నిర్లక్ష్యంతో చరిత్రకు చెదలు


హనుమకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఆ గ్రామం కాకతీయుల సైనిక స్థావరం. పలు ఆలయాలకు, అద్భుతమైన శిల్పసంపదకు నిలయం. అంతటి చరిత్రకు పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెదలు పడుతోంది. పట్టించుకునేవారు లేక అపురూప శిల్పాలు మట్టికొట్టుకుపోతున్నాయి. ప్రాచీన ఆలయాలు శిథిల మవుతున్నాయి. శాసనాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఓరుగ ల్లు వారసత్వ సంపదను కాపాడటంలో కేంద్ర పురావస్తు శాఖ, రాష్ట్ర పురావస్తు శాఖలు సైతం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నాయనడానికి ఈ గ్రామమే నిదర్శనంగా నిలుస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతో కనుమరుగువుతున్న కొండపర్తి గ్రామం చరిత్ర భవిష్యత్ తరాలకు దూరమవుతుందన్న ఆవేదన స్థానికుల్లో కనిపిస్తోంది. వరంగల్‌కు సమీపంలో ఉన్న ప్రసిద్ధి కెక్కిన గ్రామం కొండపర్తి. అటు ఐనవోలు మండల కేంద్రం నుంచి.. వరంగల్ నగరం నుంచి 13 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామం కాకతీయుల కాలంలో సైనిక స్థావరంగా వెలుగొందింది. నాడు సైనిక కవాతులతో దద్దరిల్లి సామంత సేనగా వర్ధిల్లింది. రుద్రదేవుడికి మంత్రిగా పని చేసిన కాటమసేనాని, ఆయన రెండవ కుమారుడు చౌండసేనాని కొండపర్తివాసులే. నాడు చౌండసేనాని కాకతీయ సైన్యానికి అధిపతిగా ఉండేవాడు. చౌండసేనాని మంచి పరిపాలనాదక్షుడు. కొండపర్తితో ఉన్న అనుబంధంతో ఈ గ్రామాన్ని సైనిక స్థావరంగా తీర్చిదిద్దాడు. అంతే కాకుండా గ్రామం పట్ల ఉన్న మమకారంతో తన పేర చౌండ సముద్రం అనే చెరువును తవ్వించాడు. ఎన్నో ఆలయాలను నిర్మించాడని ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి.రెండు కొండల మధ్య ఉన్న గ్రామం కావడంతో కొండపర్తి అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతుంటారు. గణపతి దేవ చక్రవర్తి కాలంలో వేయించిన శాసనాలు ఉండగా.. చౌండసేనాని నిర్మించిన దేవాలయాలు, తటాకాలు నేటికీ కనిపిస్తాయి.

- చౌండసేనాని నిర్మించిన చౌండేశ్వరాలయాన్ని కొండపర్తి శివాలయంగా పిలుస్తారు. ఆలయంలోని శాసనం ప్రకారం ఇది క్రీ.శ 1125లో నిర్మితమైందని తెలుస్తోంది. ఆలయంలో శివలింగం,


త్రికూటాలయం

విష్ణు మూర్తి, పోలేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారని, ధూపదీప నైవే ద్యాల కోసం చౌండ్యపురం అనే అగ్రహారాన్ని, నారుకుర్తి అనే మరో గ్రామాన్ని దానమిచ్చారని చెబుతుంటారు. చౌండసేనాని వేయించిన శాసనం, ఆంజనేయ స్వామివిగ్రహం, భైరవమూర్తి విగ్రహాలు, ఇతర శిల్పాలు ఇక్కడ చెల్లాచెదరుగా పడి కనిపిస్తాయి.

- కొండపర్తిలోని త్రికూటాలయం అద్భుత శిల్పకళ, అపూరూపమైన నిర్మాణశైలితో ఆకట్టుకుంటుంది. ప్రోలరాజు నిర్మించిన ప్రోలేశ్వరాలయం, తర్వాత రుద్రదేవుడు కట్టించిన రుద్రేశ్వరాలయాలతో కలిసి ఒక చెన్నకేశవాలయాన్ని నిర్మించారు. ఇవి మూడు కలిసి త్రికూటాలయంగా వర్థిల్లుతోంది. ప్రస్తుతం ఇదొక్కటే కాల గతిన నిలిచిన దేవాలయం. ఈ ఆలయంలో గతంలో ఓ వినాయ కుడి విగ్రహం ఉండేది. కాలక్రమంలో అది చోరీకి గురైంది. కొండ పర్తి పెద్ద చెరువు కట్టపై ఒక పురాతన ఆలయం, కొండపర్తిలో ఉన్న మరో ఆలయం నేలమట్టమై శిథిలాలు మిగిలాయి. 500 స్తం భాలతో నిర్మితమైన ఈ దేవాలం ప్రస్తుతం


కొండపర్తిలోని బురుజు

శిథిలావస్థకు చేరు కుంది. భోగేశ్వరాయలయంగా పిలిచే ఈ గుడి ఎదుట వీరాంజనేయ స్వామి విగ్రహం నేటికీ పూజలందుకుంటోంది. అలాగే వేణుగోపాల స్వామి ఆలయం, సురాభాండేశ్వరాలయం (శివాలయం) కూడా ఉన్నాయి. వేణుగోపాల స్వామి ఆలయంలో నల్లరాతితో చెక్కిన పద్మనాభ స్వామి, గరుడ, అంజనేయ స్వామి విగ్రహం దర్శన మిస్తాయి. వాటి కింద నుంచి రహస్య సొరంగ మార్గం ఉందని చెబుతారు.

- చారిత్రక కొండపర్తిలోని సురాభాండేశ్వరాలయ ప్రవేశంలో రెండు వైపుల ద్వారా పాలక విగ్రహాలు, ఆలయంలోకి లోపలికి ప్రవేశించగానే వివిధ రకాల పరిమాణాల్లో మూడు నందులు కనిపి స్తాయి. ఇందులో రెండు కాకతీయ శైలిలో ఉండగా, మరొకటి చాళు క్య శైలిలో ఉంటుంది. అంతరాలయంలో శివలింగంపైన పైకప్పుపై సూక్ష్మరాతి విగ్రహాలు చెక్కి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆ విగ్రహాల్లో ఒక యుద్ధ వీరుని విగ్రహం కనిపిస్తుందని, అది చౌండ సేనానిదని చెబుతారు. గ్రామంలో మూడు రాతి శాసనాలు ఉండగా ఊరి చివరన చెరువుగట్టు పక్కన ఉన్న గుట్టమీద కొక్కెర గుండు అని పిలిచే రాతి బండపై ఒక శాసనం ఉంది. దానిపై క్రీశ 9వ శతాబ్దం నాటి ప్రాచీన తెలుగు లిపి ఉంది. మూడో శాసనం క్రీశ 1242లో అందుకు ముందు నిర్మితమైన పోలేశ్వర ఆలయంలో రుద్రే శ్వర, కేశవమూర్తులను ప్రతిష్ఠాపన చేసిన ఆలయానికి ప్రాకారం ఏర్పరచినట్లు రాసి ఉంది.

నేడు దీనావస్థలో...

కొండపర్తిలోని కాకతీయుల నాటి ప్రాచీన ఆలయాలు, కట్టడాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. నాటి సైనిక స్థావర ఆనవాళ్లు చౌండసేనాని నిర్మించిన ఆలయాలు కనుమరగవుతున్నాయి. చౌండేశ్వరాలయం ఈ ఆలయం పూర్తిగా శిథిలమైంది. ఆలనా పాలనా లేకపోకవడంతో ఆలయం చుట్టూర చెట్లు, ముళ్లపొదలు దట్టంగా పెరిగి అక్కడి వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఆ పక్కనే రెండు నంది విగ్రహాలు మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి. పట్టించుకునేవారు లేక త్రికూటాలయం క్రమంగా ధ్వంసమ వుతోంది. ఈ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర పురావస్తు శాఖ స్తంభాలపై నెంబర్లు వేసింది కానీ ఆ తర్వాత పట్టించుకోలేదు. కాకతీయుల నాటి శిల్పాలు భూమిలో కూరుకుపోతున్నాయి. శాసనాలు దెబ్బతింటున్నాయి. చుట్టూదట్టమైన చెట్లు, ముళ్లపొదలు పెరగడంతో ఆలయాలలోపలికి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామస్థులు రాతి స్తంభాల వద్ద పశువులను కట్టేస్తున్నారు. ఆలయ శిథిలాలు మందు బాబులకు అడ్డాగా మారాయి.

కల్యాణం.. కమనీయం..

- అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయం
- భక్తజనంతో ఉప్పొంగిన జీడికల్ వీరాచల క్షేత్రం
- పట్టు వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య


తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భక్తులు

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తిరుక్కల్యాణ మహోత్సవాల్లో భాగంగా జీడికల్ వీరాచల శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు భక్తులు పోటెత్తడంతో జీడికల్ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ బ్రహ్మోత్సవ వేడుకల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లను చేపట్టగా కల్యాణ మహోత్సవానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలను, హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు పెసరు సుజాతమ్మ ముత్యాల తలంబ్రాలను అందజేశారు. సుమారు రెండున్నర గంటల పాటు వేదపండితులు 31 మంది జంటలతో ఈ కల్యాణ తంతును నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీతో పాటు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీపీవో స్వరూప, ఆర్డీవో గోపీరామ్ కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. ఇక వేడుకకు తరలొచ్చిన భక్తులు వీరాచలాద్రిపై ఉన్న జీడి గుండం పాలగుండాల్లో భక్తులు పుణ్యస్నానా లు ఆచరించి స్వామి వారి దర్శనం చేసుకు న్నారు. లేడిబండ వద్ద నీటి ఊటలను, మాయ లేడి రూపంలో ఉన్న మారీచుడి పాదాలను దర్శించుకున్నారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తుల కోసం లింగాలఘణపురం మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన వితరణ చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ ఆధ్వర్యంలో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నర్మెట సీఐ అబ్బయ్య, లింగాలఘణపురం, రఘునాథపల్లి, దేవరుప్పుల, పాలకుర్తి ఎస్సైలు బండి శ్రవణ్‌కుమార్, నరేశ్, సృజన్‌కుమార్, యాకూబ్ హుస్సేన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూల ద్వారా సర్వదర్శనానికి అనుమతిం చారు. ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ మూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, పాలకుర్తి ఆలయ కార్యనిర్వహ ణాధికారి లక్ష్మీప్రసన్న, ఉప్పలమ్మ దేవస్థానం ఈవో కెకె రాములు, రాజేంద ర్ రెడ్డి, మోహన్, భరత్‌కుమార్, మల్లేశం, ధర్మకర్తలు మొటికె శ్రీశైలం, నర్ర శరభారెడ్డి, ఊడ్గుల వెంకన్న, కత్తుల శ్రీనివాస్‌రెడ్డి, మంద శ్రీధర్‌రెడ్డి, కడకంచి లక్ష్మి, పసునూరి ఉపేందర్, తుపాకుల వెంకటేశ్, అబ్బటి బచ్చిరెడ్డి తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తా : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సుప్రసిద్ధ జీడికల్ ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం బ్రహ్మోత్సవాలకు హాజరైన మాట్లాడారు. ఆలయాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా జీడికల్‌కు రావాల్సిన రోడ్లను కూడా అభివృద్ధి చేస్తానని, భక్తులకు వసతి సత్రాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ వీరాచాల క్షేత్రం పైనున్న జీడి, పాల గుండాలకు భక్తులు వెళ్లేందుకు ఏడాదిలోపు మెట్ల నిర్మాణం చేయిస్తామన్నారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బన్న అయిలయ్య

నిత్య చైతన్యశీలి కాళోజీ

- ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి
- కళాక్షేత్రంలో ఘనంగా తొలి కవి సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నిత్య చైతన్య శీలి అని, ఆయన సాహిత్యం నిత్య నూతన చైతన్యమని కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి అన్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రభుత్వం జాతికి అంకితం చేసిన సందర్భంగా బుధవారం కాళోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలి కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా వరంగల్ కవిలోకం ఎదురుచూస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని ఎట్టకేలకు ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, కాళోజీ ఫౌండేషన్ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాళోజీ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అంటూ జీవితమంతా సమాజానికి అంకితం చేసిన మహావ్యక్తి కాళోజీ అని శ్లాఘించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ వరంగల్ కవులు ఎదురుచూస్తున్న కల నెరవేరిందని, కవులు, రచయితలు, కళాకారులు వరంగల్‌ను గొప్ప సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ కవి బిల్ల మహేందర్ ఆహ్వానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆచార్య బన్న అయిలయ్య, అనిశెట్టి రజిత, మహ్మద్ సిరాజొద్దీన్ సీతాల రఘువేందర్, డీపీఆర్వో భానుప్రకాశ్ తదితరులు హాజరయ్యారు. కవి సమ్మేళనంలో కవులు నెల్లుట్ల రమాదేవి, అంజనీదేవి, దేవులపల్లి వాణి, మాదారపు వాణిశ్రీ, అన్వర్, తాడిచర్ల రవి, కుమార్, పల్లేరు వీరస్వామి, కార్తీక రాజు, జితేందర్, మహ్మద్ గుల్షన్, ఉమ, రమాదేవి, వందన, రాజమోహన్, వకుల వాసు, హాజీనురాని, శంకర్ నారాయణ, అనిత, విద్యాదేవి, పెద్ది వెంకటయ్య, మస్న వెంకటేశ్వర్లు, వి.రవికుమార్, రామా రత్నమాల తదితర 60మందికి పైగా కవులు కవితా గానం చేశారు. కవిలోకం ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కాళోజీ కళాకేంద్రంలో కవి సమ్మేళనంలో పాల్గొనడం మధురానుభూతిని కలిగించిందని కవులు హర్షం వ్యక్తం చేశారు.

కవులకు దక్కిన గౌరవం


నెల్లుట్ల రమాదేవి, కవయిత్రి

కళలకు కాణాచి, ఉద్యమాల పురిటి గడ్డ మన ఓరుగల్లు. రాష్ట్రంలో ఎక్కడా లేనంత అద్భుతమైన వేదిక ఏర్పడడం, అది కూడా మన ధిక్కార స్వరాన్ని, పోరాటా స్వభావాన్నీ వారసత్వంగా ఇచ్చిన కాళోజీ పేరిట నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది కవులందరికి దక్కిన గౌరవం.

అద్భుత దర్శనీయ స్థలం.. కళాక్షేత్రం


అన్వర్, కవి

కాళోజీ స్ఫూర్తి ప్రదాత. వరంగల్ చరిత్రలో కాళోజీ కళాక్షేత్రం అద్భుతమైన దర్శనీయ కట్టడం. కాళోజీ గౌరవానికి ఏ మాత్రం తగ్గకుండా అంతే గొప్పగా సాంకేతిక పరిజానంతో కట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఇంత గొప్ప కళాక్షేత్రం లేదన్నది వాస్తవం. కాళోజీ పౌరుషానికి తగ్గట్టుగా ఉందీ భవనం. కళాక్షేత్రం ఎదుట కాళోజీ విగ్రహం జీవకళతో ఉట్టిపడుతోంది. ప్రభుత్వం, నాయకులు, అధికారులు, కాళోజీ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు. ఇన్నేళ్ల నిరీక్షణ ఫలించింది.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం కృషి

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం • కేంద్ర సహాయ మంత్రి నిమూబెన్ జయంతి బాయి బంబానియా

గణపురం / భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు గాను 'ఆకాంక్షాత్మక' జాబితాలోని జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర వినియోగదారుల, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి నిమూబెన్ జయంతి బాయి బంబానియా తెలిపారు. ఆకాంక్షాత్మక జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం భూపాలపల్లి జిల్లాకు వచ్చిన ఆమె గణపురం మండలంలోని చెల్పూరులో పర్యటించి మిల్లెట్ హౌస్ యూనిట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా మల్టీగ్రేన్ జావ, రాగి లడ్డూలను తిని చాలా బాగున్నాయని అభినందించారు. వైద్య, డీఆర్డీఏ, మత్స్య, వ్యవసాయ, ఉద్యాన, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించి.. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన సభలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 112 జిల్లాలను అభివృద్ధి చెందనివిగా ఆకాంక్షాత్మక జాబితాలో కేంద్రం గుర్తించిందని, అందులో భూపాలపల్లి కూడా ఉందన్నారు. ఈ జిల్లాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నీతిఆయోగ్ ఆకాంక్షాత్మక జిల్లాలుగా ఏర్పాటు చేసిందన్నారు. 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్' నినాదంతో కేంద్రం ముందుకెళుతోందని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను ఐదో స్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీదని, మున్ముందు మూడో స్థానంలోకి తీసుకురావాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యాస్పిరేషన్ లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాకు రూ. 10 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మిల్లెట్ యూనిట్ నుంచి తయారు చేసిన ఆహార పదార్థాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంగా అందించడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి అదనపు కార్యదర్శి ఖుష్బూ, భూపాలపల్లి అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిమూబెన్ జయంతి బాయి బంబానియా

కలెక్టరేట్‌లో అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం

గణపురం మండలం చెల్పూరు నుంచి భూపాలపల్లి కలెక్టరేట్‌కు చేరుకున్న కేంద్ర సహాయమంత్రి నిముబెన్ జయంతి బాయ్ బంబానియా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి లక్ష్యాలు సాధనపై విద్యావైద్య, వ్యవసాయ, ఉద్యాన, సంక్షేమ, డిఆర్డీఓ శాఖల అధికారులతో కేంద్రమంత్రి సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కలికట్టుగా కృషి చేయాలన్నారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో జిల్లా ప్రదర్శనను కేంద్రమంత్రి అభినందించారు. సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీవో బాబు రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రపంచంలో ఎక్కడా లేనివి తెలంగాణలో ఉన్నాయి
- వీక్షకులను ఒలలాడిస్తున్న లక్నవరం సరస్సు
- మౌళిక వసతులకు పెద్దపీట
- మూడో ఐలాండ్ ప్రారంభంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

గోవిందరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామ సమీపంలో ఉన్న లక్నవరం సరస్సులో రూ.7కోట్ల వ్యయంతో మూడెకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ములుగు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. సహజసిద్ధమైన అందాలతో లక్నవరం సరస్సు వీక్ష కులను అలరిస్తోందని, రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండటంతో పాటు దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ జాతర ములుగు జిల్లాకు గుర్తింపు తెచ్చిపెడుతోందన్నారు. పర్యాటకుల అవస రాలను దృష్టిలో పెట్టుకుని మౌళిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని, లక్నవరం సరస్సులోని ద్వీపాల అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుదూర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం కూడా లేకుండా తెలంగాణలో ఇలాంటి ఓ అందమైన టూరిజం స్పాట్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సరస్సులోని రెండు ద్వీపాల్లో ఇప్పటికే కాటేజీల నిర్మాణం పూర్తయిందని, మూడో ద్వీపంలో కాటేజీల నిర్మాణాన్ని కూడా పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను బలోపేతం చేయడానికి రూ.250 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్టు తెలిపారు.

మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయిస్తున్నారన్నారు.


లక్నవరం సరస్సులోని మూడో ద్వీపంలో కాటేజీలను ప్రారంభిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ రూ.100కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పర్యాటక ప్రాంతాల్లో ఎవరూ ప్లాస్టి క్ కవర్లు వాడొద్దని ఆమె కోరారు.

పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల గత ప్రభుత్వ పాలనలో పర్యాటక ప్రాంతాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, పీపీపీ తరహాలో పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దు తామన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో పర్యాటక ప్రాంతా లకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పర్యాటక అభివృద్ధిసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోతన ఊరిలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం

పాలకుర్తిలో మంత్రి జూపల్లి

పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాగవత గ్రంథకర్త బమ్మెర పోతన, బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడి స్మారక స్మృతి వనాల అభివృద్ధి పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయని, వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన మామిడాల యశస్వినిరెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి బమ్మెర గ్రామంలోని పోతన స్మారక స్మృతివనాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులు పోతన పద్యాలు నేర్చుకోవాలని సూచించారు. అమెరికాలో తెలుగు వారు వారి పిల్లలకు యాప్ ద్వారా పద్యాలను వినిపిస్తున్నారని, పోతన పద్యాలు ఎల్లలు దాటితే.. మన ప్రాంతం వారు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది నుంచి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. చెక్ డ్యాం నిర్మాణానికి రైతులతో మాట్లాడి భూమిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాసర తరహాలో అక్షరాభ్యాసం చేసేలా నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. పాలకుర్తి, బమ్మెర, వల్మిడి గ్రామాలు మరింత అభివృద్ధి చెందేలా, టూరిస్టు సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేలా నిధుల మంజూరుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పోతన స్మారకం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. పోతన స్మారక విగ్రహం, లక్ష్మీ విగ్రహం కోసం మరిన్ని నిధులిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రిటైర్డు ఐఏఎస్ పాపారావు, రిటైర్డు ప్రొఫెసర్ పాండురంగారావు, డీపీవో స్వరూప, ఈఈ ప్రవీన్, డీఈ శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ రాంబాబు, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ రాజేందర్, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, యుగేంధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


బమ్మెరలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నేడు బీసీ రిజర్వేషన్లపై బహిరంగ విచారణ

జనగామ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ నిర్వహించే బహిరంగ విచారణకు ఈనెల 21న హాజరు కావాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గురువారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హనుమకొండ కలెక్టరేట్‌లో డెడికేషన్ కమిషన్ అభిప్రాయ సమర్పణలు, సలహాలు, ఆక్షేపణలు స్వీకరిస్తుందన్నారు. డెడికేషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు, సెక్రటరీ బి.సైదులు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్లు దామాషా పేర్కొనే విషయంలో ఆసక్తికలిగిన బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీవోలు అభిప్రాయ సమర్పణ చేయవచ్చన్నారు.

సాధికారత అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యేటా అందించే రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డు - 2024 కోసం ఆసక్తి గల దివ్యాంగులు, వారి కోసం పనిచేస్తున్న సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి డి.ఫ్లోరెన్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు, దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేసిన వ్యక్తులు, వారి కోసం పని చేస్తున్న సంస్థలు పురుషులు, మహిళల విభాగాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 29 లోగా జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99480 48355 నంబరులో సంప్రదించాలని అన్నారు.

కరాటేలో శ్రీహరిణికి గోల్డ్‌మెడల్



శ్రీహరిణికి గోల్డ్‌మెడల్‌ను బహూకరిస్తున్న నిర్వాహకులు

కొడకండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 19న నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా జోనల్ స్థాయి అండర్-17 కరాటే పోటీల్లో బాలికల విభాగంలో మండల కేంద్రంలోని టీజీఆర్ఎస్ విద్యార్థిని శ్రీహరిణి గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థిని బక్కెర శ్రీహరిణి గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.ప్రీతమ్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రీతమ్ కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని జరిగే పోరాటంలో అంబేద్కర్‌వాదులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ మిద్దెపాక సిద్దులు, గట్టగళ్ల సంజీవ, కడారి శ్రీను, నాగరాజు, తిప్పారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

తరిగొప్పుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పత్తి సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్ర యాదాద్రి భువనగిరి వారి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మాన్‌సింగ్‌తండాలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న రైతు సారయ్య పత్తి చేనులో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు విధానం, ప్రాజెక్టు వివరాల గురించి రైతులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా అధిక సాంద్రత పత్తి సాగు విస్తరించాలని, ఈ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఎకరానికి రూ.4వేలు వారి ఖాతాలో జమ చేస్తోందని పేర్కొన్నారు. అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులు ఎకరానికి 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడిని సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మధుశేఖర్, ఏవో మనోహిత్ విక్రమ్, ప్రైవేటు విత్తన సంస్థల ప్రతినిధులు సంపత్, లక్ష్మీనారాయణ, యంగ్ ప్రొఫెషనల్స్ వేణు, రూపా, విజయకాంత్, దేశ్‌పాండే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ విచ్చలవిడిగా వాడొద్దు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్



ఘన్‌పూర్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సూచనలు పాటించకుండా విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడడం అనర్థదాయకమని, దీనిపై ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని స్టేషన్ ఘన్‌పూర్ క్లస్టర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ ఆస్పత్రిలో నిర్వహించిన ప్రపంచ యాంటీ బయాటిక్స్ వ్యతిరేక వారోత్సవాలు-2024 సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులు సొంతంగా వాడకుండా యాంటీ బయాటిక్స్ మందులు వైద్యులు సూచించిన మోతాదులో వాడాలన్నారు. అలా చేయకపోతే భవిష్యత్‌లో అవి పని చేయని పరిస్థితి దాపురిస్తుందన్నారు. తద్వారా వ్యాధులు నయం కావడం ఆలస్యం అవుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు, వైద్యాధికారి సంధ్య, డాక్టర్ సునిత, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జనార్దన్, డాక్టర్ అజయ్, సీహెచ్‌వో చింత వెంకటస్వామి, మురహరి, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రాజయ్య పరామర్శ

చిలుపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన ఇల్లందుల పెద్ద ఎల్లయ్య(75) కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బుధవారం పరామర్శించారు. ఎల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు, మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బత్తుల రాజన్‌బాబు, మోటం రాములు ఉన్నారు.

భక్తుల కొంగు బంగారం లక్ష్మీనృసింహుడు

- రేపటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు
- 24న కల్యాణం.. ఏర్పాట్లు పూర్తి





బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, శ్రీలక్ష్మీనర్సింహ స్వామి(ఇన్‌సెట్‌లో)

జఫర్‌గడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణకు అంతా సిద్ధం చేశారు. జఫర్‌గడ్‌లో ఎత్తైన పడమర కొండపై సతీసమేతంగా రాతిని చీల్చుకుని వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందారు. శ్రావణ మాసోత్సవాలు, స్వామి వారి జయంతి ఉత్సవాలతో పాటు బ్రహ్మోత్సవాల్లో జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు జఫర్‌గడ్‌కు విచ్చేసి ఎత్తైన కొండపైకి కాలినడకన చేరుకుని స్వామి వారిని దర్శించుకుని తరిస్తారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. మహిమాన్వితుడైన స్వామి వారి బ్రహ్మోత్సవాలను ప్రతీ ఏటా కార్తీక మాసంలో వైభవంగా నిర్వహిస్తారు.

ఉత్సవాలు జగనున్నాయిలా..

స్వామి వారి బ్రహ్మోత్సవాలను ప్రతీ ఏటా భక్తుల సౌకర్యార్థం కొండ దిగువన గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 22 నుంచి 25 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా 22న శుక్రవారం స్వస్తి వాచనము, పుణ్యాహవచనము, రక్షాబంధనము, రుత్విగ్వరణము, అంకురార్పణ, ఆరగింపు తీర్థ ప్రసాదగోష్ఠి వంటి పూజా కార్యక్రమాలు, 23న శనివారం పారాయణములు, మూర్తి కుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ, సుదర్శనారసింహ హోమము, పూర్ణాహుతి 24న ఆదివారం స్వామి వారికి విశిష్ఠ పూజల అనంతరం శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఇదేరోజు సాయంత్రం ప్రజల దర్శనార్థం గరుడ వాహనంపై స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు. 25న సోమవారం పారాయణములతో పాటు శాంతి హోమం, స్వామి వారికి చక్రస్నానం చేయించి విశిష్ట పూజలు గావిస్తారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీసేవ, పుష్పయాగం నిర్వహిస్తారు. అదేవిధంగా కొండ దిగువన అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ.. వంటి విశిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చక పండితులు పొడిచేటి శ్రీనివాసాచార్యులు. ఠయ్యాల కృష్ణమాచార్యులు, పొడిచేటి సగంపాలు వెంకటాచార్యులు తెలిపారు.

ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం

శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు పెద్ద ఎత్తున జరిగే శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అర్చక పండితులు, నిర్వాహకులు తెలిపారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా సాగే ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని, బ్రహ్మోత్సవాల విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నైజం ఎర్రబెల్లిది
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజ మెత్తారు. బుధవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. సీఎంపై మాజీ మంత్రి దయాకర్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. దయాకర్‌రావు మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందని విమర్శించారు. ఉద్యమ సమయంలో పదవులను పట్టుకొని పాకులాడిన చరిత్ర దయాకర్‌రావుది కాదా.. అని ప్రశ్నించారు. పాలకుర్తిలో సరైన ప్రత్యర్థులు లేకనే ఇన్ని సార్లు గెలిచావని, ఇన్నేళ్లుగా ప్రజలను పీడించుకుతిన్నాడని విమర్శిం చారు. పాలకుర్తి ప్రజలు ఓడించి సరైన తీర్పు ఇచ్చారని, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కారని అన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి ప్రజలు చీకొట్టిన దయాకర్‌రావు ఇంకా ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డిపై మాట్లాడే అర్హత ఆయనకు లేదని అన్నారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

గుడుంబా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు

జఫర్‌గడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గుడుంబా రవాణా చేస్తున్న రేగడితండా శివారు టీబీ తండాకు చెందిన ధరంసోత్ రాజా, లాకావత్ హనుమంతులపై కేసు నమోదు చేసినట్లు పాలకుర్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా గుడుంబా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం టీబీతండా క్రాస్ వద్ద తనిఖీలు జరపగా రాజా, హనుమంతులు 11 లీటర్ల గుడుంబా రవాణా చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.పద్మ, సిబ్బంది నవీన్, కుమారస్వామి, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

జఫర్‌గడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్ని రకాల పంటలకు 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు, కార్మిక, కిసాన్ మోర్చా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం జఫర్‌గడ్ రెవెన్యూ కార్యాలయంలో డీటీ కాశీంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతుల పంట రుణాలను మాఫీ చేసి, భూసేకరణ 2013 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన హామీల్లో భాగంగా పంటలకు బోనస్ ప్రకటించి, కౌలు రైతులకు పథకాలను వర్తింపజేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కాంట్రాక్ట్ విధానాన్ని శాశ్వతంగా రద్దు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలను వర్తింపజేసి దినసరి కూలీ వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరలను నియంత్రించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘాల నేతలు నీరటి కొమురయ్య, ఎర్ర రవి, బి.సమ్మయ్య, పినింటి సమ్మయ్య, బంగారు చిరంజీవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు డిసెంబరు 3లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కె.రాము బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు పై ట్రేడ్‌లలో లోయర్ గ్రేడ్‌కు, లోయర్ గ్రేడ్‌లో ఉత్తీర్ణులైన వారు హయ్యర్ గ్రేడ్‌కు అర్హులవు తారని, అర్హత, ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో బీఎస్ఈ.తెలంగాణ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

బచ్చన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్ అఖిల భారత కమిటీల పిలుపుతో ధర్నా చేపట్టారు. చట్టబద్ధత కొనుగోలుకు హామీ ఇవ్వాలని, కార్మికులకు లేబర్ ఫోర్ కోడ్స్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అన్నెబోయిన రాజు, తాడెం రాములు, రవి, కుమార్, నాగరాజు, ఇంద్ర, సునీత, ఎల్లమ్మ, లక్ష్మి, శోభ పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రకాశ్‌రావుకు అందించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేషన్ ఘన్‌పూర్ పట్టణం మమత ఆస్పత్రిలో ఈనెల 21న ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దస్తగిరి తెలిపారు. హనుమకొండ శరత్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నేత్ర పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.హెల్త్ కార్డు కలిగి ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి అవసరమైతే శరత్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారని చెప్పారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచిత రవాణా, వసతి, భోజనం కల్పిస్తారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

- జఫర్‌గడ్‌ను హనుమకొండ జిల్లాలో చేర్చాలి
- ఉద్యమకారుల జేఏసీ నేతల డిమాండ్



కేసులు ఎత్తివేయాలంటూ నినాదాలు చేస్తున్న ఉద్యమకారుల జేఏసీ నేతలు, మహిళలు

జఫర్‌గడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జఫర్‌గడ్ మండలాన్ని హనుమకొండ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ పోరాటం సాగించిన ఉద్యమకారులపై అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఉద్యమకారుల జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ నేతల సమావేశం కన్వీనర్ రాజేశ్‌నాయక్ అధ్యక్షతన బుధవారం జఫర్‌గడ్‌లో జరిగింది. వివిధ పార్టీల అఖిలపక్ష జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా జఫర్‌గడ్ మండలాన్ని జనగామ జిల్లాలో కలపడాన్ని నిరసిస్తూ 2018లో మండల ప్రజలు ఆందోళనలు చేపట్టారన్నారు. ఈ ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉండే వరంగల్ అర్బన్ జిల్లాలో కలపాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అన్ని పార్టీలు, ప్రజలు సంఘటితమై జేఏసీగా ఏర్పడి మూడు నెలల పాటు పోరాటం సాగించామన్నారు. ఉద్యమాన్ని అణచేందుకు మహిళలతో సహా సుమారు 50 మంది ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టి వారం రోజుల పాటు జైలులో నిర్బంధించారన్నారు. అయితేఉద్యమకారులపై పెట్టిన మూడు కేసుల్లో రెండు కేసులు అలాగే కొనసాగుతుండడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి కేసులను ఎత్తివేయడంతో పాటు ప్రజల మనోభావాల కనుగుణంగా జఫర్‌గడ్ మండలాన్ని హనుమకొండలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ఉద్యమకారులకు వర్తింపజేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానించారు.

ఈ సమావేశంలో ఉద్యమ జేఏసీ నేతలు బానోత్ రాజేశ్‌నాయక్, అన్నెబోయిన భిక్షపతి, కుల్ల మోహన్‌రావు, రాపర్తి రాజు, పి.సదయ్యగౌడ్, సీహెచ్.కృష్ణమూర్తి, సీహెచ్.సోమనర్సయ్య, రాపర్తి సోమయ్య, బండి యాదగిరి, కాట సుధాకర్, జెట్టి రవి, కుక్కల ఎల్లయ్య, కుక్కల సారంగం, కాట కృష్ణ, ఎస్.శ్రీధర్, సముద్రాల లక్ష్మి, కుంభం ధనమ్మ, సుగుణమ్మ, నీలం యాకమ్మ, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేలపోగులలో ఉచిత పశువైద్య శిబిరం



నేలపోగులలో పశువైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ అధికారులు

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలపోగుల గ్రామంలో బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాగా క్యాంపుకు వచ్చిన పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సాయికార్తీక్ మాట్లాడుతూ కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టేందుకు వీలుగా లింగనిర్ధారణ చేసిన సెక్స్ స్టార్టెడ్ సెమెన్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా గోపాలమిత్రలకు, ప్రభుత్వ పశువైద్యశాలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జితేందర్ నాయక్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జయపాల్‌రెడ్డి, అంబాల వీరస్వామి, చేరబుడ్డి రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. బాల్యంలో విద్యపై ఆసక్తి కలిగి ఉంటేనే జీవిత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. యువత చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, డీసీపీవో రవికాంత్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, స్కోప్ కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్, ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలల దినోత్సవం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: డివిజన్ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి హైస్కూళ్లు, మోడల్ స్కూల్‌లో, పీఎస్‌లు, యూపీఎస్‌లలో బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని, సెల్‌కు బానిసలుగా మారమని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా చైతన్యం చేస్తామని, దేశభక్తి కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, హెచ్‌ఎంలు సదామోహన్, శ్రీధర్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

- అంతిమ సంస్కారాలకు రూ.62వేల ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రతినిధులు

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిచర్ల గ్రామానికి చెందిన లింగాల కృష్ణమూర్తి అనే నిరుపేద నాయీబ్రాహ్మణుడు మృతి చెందగా వడ్డిచర్ల హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటైన సోషల్ ప్లాట్‌ఫాం సభ్యులు రూ.62,600 ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివసించేందుకు కనీసం ఇల్లు కూడా సరిగాలేని నిరుపేద కుటుంబీకుడు దొరికిన చోటల్లా అప్పులు తెచ్చి వారం రోజుల క్రితమే తన కూతురు పెళ్లి చేశాడు. సరిగ్గా వారం రోజులు తిరగకముందే అస్తమా కారణంగా అకాల మరణం చెందిన కృష్ణమూర్తి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీంతో బీద కుటుంబానికి అండగా నిలిచేందుకు వడ్డిచర్ల హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ముందుకువచ్చారు. అంతిమ సంస్కారాలు ఇతరత్రా ఖర్చుల కోసం రూ.62,600 ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచి ఆత్మస్థైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

కన్నీటి సంద్రమైన కట్కూరు

- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



తండ్రి సాయిబాబా మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నారి

బచ్చన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో మండలంలోని కట్కూరు వాసులు దూసరి సాయిబాబా, ఎనుగుల కర్ణాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం చేర్యాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఇద్దరు యువకుల మృతదేహాలను చూసిన గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.

డాడీ వచ్చే వరకు అన్నం వద్దు..

'డాడీ ఎక్కడికి వెళ్లినా రాత్రి ఇంటికి వచ్చేవాడు.. డాడీ రానిదే అన్నం వద్దు.. తొందరగా రమ్మని ఫోన్ చేయమ'ంటూ సాయిబాబా కూతురు మనుశ్రీ రాత్రంతా రోధించటం చూసి అక్కడున్న వారంతా కన్నీరు పెట్టుకున్నారు. తెల్లవారినా తండ్రి మృతదేహం మార్చురీలో ఉందని తెలియని చిన్నారి డాడీ ఇంకా రాలేదంటూ మారాం చేయటం హృదయాలను కలిచివేసింది. సాయిబాబాకు ఒక్కతే కూతురు కావటంతో అల్లారుముద్దుగా పెంచాడు. కాగా, కుమారుడికి కూతురు, తల్లి కలిసి తలకొరివి పెట్టి అంత్యక్రియల తంతు జరిపారు.

కన్నీటిసంద్రంలో కర్ణాకర్ కుటుంబం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కర్ణాకర్ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగింది. మృతుడికి కూతురు, కుమారుడున్నాడు. మృతదేహం వద్ద లే బాపూ అంటూ రోదించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరు యువకులు ప్రమాదంలో చనిపోవ టం బాధించిందని పలు పార్టీల నేతలు సంతాపం తెలిపారు.